క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

సింగరాయకొండ: కొండపి మండలంలోని పెద్ద కండ్లగుంట గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి అనూష తెలిపారు. అలాగే సింగరాయకొండ–2 సచివాలయం పరిధిలో కందుకూరు రోడ్డు సెంటర్‌లోని లోటస్ హైస్కూల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ జమీఉల్లా తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పీసీపల్లి విద్యార్థులు


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

పీసీపల్లి: రాష్ట్ర స్థాయి పోటీలకు పీసీపల్లి మండలానికి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు స్థానిక జెడ్పీహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డేగ ఆంజనేయులు తెలిపారు. యోగా సెలక్షన్‌లో పాఠశాలకు చెందిన టి.గణేష్, ఐ వరుణ్ సాయి, డిస్కస్‌త్రోలో విన్సెంట్, హెమరోల్డ్‌లో క్రాంతికుమార్‌లు ఎంపికయ్యారు. వీరిని బుధవారం ప్రధానోపాధ్యాయుడు డేగ ఆంజనేయులు ఉపాధ్యాయులు అభినందించారు.

తహసీల్దార్‌గా వాసు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ వాసు

వెలిగండ్ల: తహసీల్దార్‌గా ఎన్ వాసు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లాలో డీటీగా పనిచేస్తూ పదోన్నతిపై వెలిగండ్లకు వచ్చారు. అనంతరం కార్యాలయం సిబ్బంది, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

కనిగిరి రూరల్: పట్టణంలో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం చైర్మన్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ కాచిపుడిపల్లె లో డీప్ బోర్‌వెల్ ద్వారా పైప్‌లైన్ కనక్షన్‌తో నీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. పట్టణంలో అన్ని వార్డుల్లో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపడతున్నట్లు వివరించారు. ప్రణాళికాబద్ధంగా పట్టణంలోని 20 వార్డుల్లో నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కౌన్సిలర్ దేవరాజ్, మాజీ ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను, ఎల్‌ఐ వెంకటయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పందుల రక్త నమూనాల సేకరణ


పందుల రక్తనమూనాలు సేకరిస్తున్న వెటర్నరీ అధికారులు, డాక్టర్లు

పామూరు: మండల కేంద్రమైన పామూరుతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో పందులు తరుచూ వ్యాధులకు గురై మృత్యువాత పడుతున్నాయి. దీనిపై పంచాయతీ అధికారుల చొరవతో వెటర్నరీ అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం పశుసంవర్ధకశాఖ మార్కాపురం డీడీ డాక్టర్ వెంకట సుబ్బయ్య, ఒంగోలు ఏడీ డాక్టర్ నాగార్జున, సీఎస్‌పురం ఏడీ డాక్టర్ ఆర్.రమేష్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీకాలనీలో పందుల నుంచి రక్తనమూనాలను సేకరించారు. అదేవిధంగా కొన్నింటికి టీకాలు వేశారు. పందుల మృతిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్.మునీర్, డాక్టర్ ఈమని శ్రీసాయి, పీఎస్ బ్రహ్మానందరెడ్డి, ఎల్ఎస్ఏ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్‌కు కేజీబీవీ విద్యార్థులు ఎంపిక


ఎంపికైన క్రీడాకారిణులతో ప్రిన్సిపాల్, పీఈటీ

గుడ్లూరు: ఇటీవల సింగరాయకొండలోని హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ ఎంపికల్లో గుడ్లూరు మండలం మొగళ్లూరు కేజీబీవీ విద్యార్థినులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ అమృతజ్యోత్స్న, పీఈటీ కె.చిట్టెమ్మ తెలిపారు. 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌కు నీలం స్నేహతిరుమల, 1500 మీటర్లకు ఎం.భవ్యశ్రీ, 3000 మీటర్లకు జి.శ్రీలక్ష్మి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణులను ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీ, సీఆర్టీ అభినందించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం


వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే బుర్రామధుసూదన్‌యాదవ్

పామూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని ఇనిమెర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసులు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సీఎం ఎస్ గన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యరంగాలకు అధికప్రాధాన్యం ఇచ్చారన్నారు. ప్రతిజిల్లాకు ఒక జిల్లా స్థాయి వైద్యశాల ఏర్పాటుచేసి పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ధ్యేయంగా ముందడుగు వేస్తున్నారని, ఇందులో భాగంగా ఇప్పటికే నూతనంగా 5 ప్రభుత్వ వైద్య, కళాశాలలను ప్రారంభించారన్నారు. వైద్యశిబిరంలో డాక్టర్లు డి.హరిబాబు, డాక్టర్ రుబీనా, డాక్టర్ రవళి ప్రియాంక, డాక్టర్ విజయ్‌కుమార్‌లు 321 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కింద వీరనారాయణమ్మకు రూ.1.50 లక్షలు, లక్ష్మీనారాయణకు రు.2.50 లక్షలు, వెంకటరమణకు రూ.5 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ యేసురత్నం, కోఆప్షన్ నాయబ్‌రసూల్, సర్పంచ్ సిద్ద లక్ష్మీ సిడెంట్‌బొమ్మన శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్. ప్రియాంక, హెచ్ఈఓ బ్రహ్మానందం, శ్రీధర్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, పార్టీ పట్టణఅధ్యక్షుడు చాంద్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ ఖాదర్‌బాషా, భాస్కర్‌రెడ్డి, గోవిందయ్య పాల్గొన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు.

వెలిగండ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎంపీడీఓ టి.సుకుమార్ అన్నారు. మండలంలోని ఇమ్మడిచెరువు జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఓ మహమ్మద్ బాషా, సీనియర్ అసిస్టెంట్ ఖాదర్ బాషా, డాక్టర్లు సునీత, రేష్మ, సునీత, పీఎస్ పరమేశ్వరి పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరురూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ లలిత కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షలో స్పెషలిస్టు వైద్యులతో వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. దీర్ఘకాలిక రోగాలకు రాష్ట్రంలోని ఆరోగ్యశ్రీ ఆస్పత్రుకు రిఫర్ చేశామన్నారు. వైద్యులు సందీప్, డాక్టర్ మాధురి, డాక్టర్ మహబూబ్, వైద్య సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పీసీపల్లి: మండల పరిధిలోని గుదేవారిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి ప్రజలుభారీగా హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బందికి మందులు అందజేశారు. చౌటగోగుల సర్పంచ్ నజీర్ బాషా, గుదేవారిపాలెం సర్పంచ్ శాంసన్, వైద్యాధికారి రాజ్యలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యత

- ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు వాకా వెంకటరెడ్డి

మర్రిపూడి: ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంకేపల్లిగ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.సుదీపా, ఈఓఆర్డీ శ్రీనివాసులు, ఎంఈఓ కోటిరెడ్డి, సర్పంచ్ తిరుపతమ్మ, పంచాయతీ కార్యదర్శి గాయత్రి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పొన్నలూరు: రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని సర్పంచ్ చొప్పర జ్యోతి పేర్కొన్నారు. మండలంలోని విప్పగుంట గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షల అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కల్పన, పీహెచ్‌సీ డాక్టర్లు కీర్తి, కృష్ణచైతన్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. మండలంలోని వంగపాడు పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ రావులపల్లి తిరుపతమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంతో పేద వర్గాలకు ఎంతో భరోసా లభిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వైద్య శిబిరాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీ సందర్శించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన సీమంతాల కార్యక్రమంలో ఎంపీటీసీ హాజరత్తమ్మ పాల్గొని, చీరె సారె పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పాశం కొండయ్య, నరాల రమణమ్మ, ఎంపీటీసీ హాజరత్తమ్మ, రైతు అధ్యక్షుడు సిద్దారెడ్డి, శ్రీహరిరెడ్డి, మహేంద్ర, రమేష్‌రెడ్డి, రవి, చల్లగాలి గురుస్వామి, మన్నేపల్లి సునీల్, ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ డాక్టర్ సృజన, వైద్యులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో పేదలందరికీ అందుబాటులోనే మెరుగైన వైద్యం అందుతోందని తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరా, ఎంపీడీఓ సీహెచ్.రామచంద్రావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య అన్నారు. మండలంలోని నల్లమడుగుల ఉన్నతపాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ సందిరెడ్డి మురళి, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ శ్రీరమ్యలు 317 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈఓపీఆర్డీ కె.సుందరరామయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం, ఎంఎల్ హెచ్‌పీ ఆశాజ్యోతి, సర్పంచ్ సూరిపోగు రాజమ్మ, ఆంథోని, బి.బ్రహ్మారెడ్డి, రామిరెడ్డి, రాజమోహన్ రెడ్డి, షేక్.హుస్సేన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


హనుమంతునిపాడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ లలిత


ఇమ్మడిచెరువులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


అంకేపల్లిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి


విప్పగుంటలో మందులు అందజేస్తున్న సర్పంచ్ జ్యోతి


విప్పగుంటలో వైద్య పరీక్షల కోసం బారులుదీరిన ప్రజలు


నల్లమడుగులలో పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ


వైద్య శిబిరంలో కళ్ల అద్దాల పంపిణీ చేస్తున్న కస్తూరిరెడ్డి

సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి వివరించాలి

- ధర్మపాలన కొనసాగించేందుకే రాష్ట్రానికి మళ్లీ జగన్ కావాలి
- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

పామూరు: ధర్మపాలన సాగించేందుకు ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే కావాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని ఇనిమెర్లలో బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోను 90 శాతంగా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. నవరత్న పథకాలతో పేదలకు అండగా నిలిచారన్నారు. ముఖ్యంగా విద్యారంగానికి నిధులకేటాయింపు బడ్జెట్‌లో 10 శాతానికి పైగా కేటాయించారని కొనియాడారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీవిద్య పథకాలతో ధనిక, పేద తేడాలేకుండా అందరికి ఉన్నతవిద్యావకాశాలు కల్పించారన్నారు.

టీడీపీ పాలన అవినీతి మయం

గత టీడీపీ పాలన అవినీతి మయంగా సాగిందని అప్పటి నాయకులు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజల సొమ్మును దోచుకున్నారన్నారు. నీరు చెట్టు పనుల్లో లెక్కలేని అవినీతి జరిగిందని ప్రజాసంక్షేమం, పాలనను గాలికి వదలిన టీడీపీ నాయకులు దోచుకోవడం, దాచుకోవడం కోసం పనిచేశారని అందుకే ప్రజలు గత ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆధారాలతో పట్టుబడిన చంద్రబాబు అక్రమాలు ఒక్కొక్కటికి బయటకు వస్తున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధిని నాయకులు, ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. వైస్ ఎంపీపీ యేసురత్నం, కోఆప్షన్ నాయబ్ రసూల్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషా, ఖాదర్‌బాషా, సర్పంచ్ సిద్ధమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి, బొమ్మన శ్రీనివాసులు, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఆకుపాటి వెంకటేష్, పోలినేని శ్రీను, షేక్.అబ్దుల్, గుర్రం వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


బి.కల్యాణి


ఎమ్మెస్సార్ కళాశాల విద్యార్థినులు ఎం సఖియా, శ్రీజ, యశోద

కనిగిరి రూరల్: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కనిగిరిలోని కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఒకరు, స్థానిక ఎమ్మెస్సార్ జూనియర్ కళాశాల విద్యార్థినులు ముగ్గురు ఎంపికయ్యారు. కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బి. కళ్యాణి ఎంపికైంది. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు తమిళనాడులోని కృష్ణాగిరి జిల్లా హోసూరులో జరిగే జాతీయ స్థాయి ఖేలో ఇండియా సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో ఆడనుంది. ప్రస్తుతం విద్యార్థి బి.కళ్యాణి జేఎన్‌టీయూ యూనివర్శిటీ జరిగే శిక్షణా కార్యక్రమంలో ఉన్నట్లు హెచ్‌ఎం సి.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారి బి.కళ్యాణిని విద్యాకమిటీ చైర్మన్ ఎం శివన్నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు అభినందించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెస్సార్ కళాశాల విద్యార్థినులు ముగ్గురు ఎంపికయ్యారు. 18 ఏళ్ల బాలికల పోటీలకు ఎమ్మెస్సార్ కళాశాలకు చెందిన ఎం సఖియా, బి.శ్రీజ, ఆర్ యశోద ఎంపికైనట్లు ఖోఖో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కాశీ విశ్వనాథరెడ్డి తెలిపారు. ముగ్గురు క్రీడాకారులను మాగుంట చారిటబుల్ ట్రస్ట్ తరపున మాగుంట రాఘవరెడ్డి, సలహాదారుడు డి.కృష్ణారెడ్డి, రాష్ట్ర ఖోఖో సంఘ అధ్యక్షుడు సీతారామిరెడ్డి, ప్రిన్సిపాల్ టి. వెంకటరెడ్డి, పీడీ శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి

- ఈఆర్‌ఓ నారదముని


ఓటరు సర్వే సమీక్షిస్తున్న ఈఆర్‌ఓ నారదముని

కొండపి(సింగరాయకొండ): ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని, అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని కొండపి నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి నారదముని స్పష్టం చేశారు. కొండపి రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఓటరు సర్వేపై ఆరు మండలాల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈఆర్‌ఓ మాట్లాడుతూ.. ఓటు నమోదులో కానీ, తొలగింపులో కానీ అధికారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ సీహెచ్ ఉష, అధికారులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత


క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓ కొండారెడ్డి

సీఎస్‌పురం (పామూరు): విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు, ఆరోగ్యం గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని 48 ప్రాథమిక పాఠశాలలు, 7 ప్రాథమికోన్నత పాఠశాలలకు బుధవారం క్రీడాసామగ్రిని పంపిణీచేశారు. పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులతో క్రీడాసామగ్రిని ఉపయోగించి ఆటలు ఆడించాలన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా క్లీనింగ్‌కిట్లు, డస్ట్‌బిన్స్, ఫినాయిల్, ఇతర సామగ్రిని పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. త్వరలో మండలంలోని అన్ని పాఠశాలలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మార్సీ సిబ్బంది యస్.దీప్తి, ఎస్.ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


సింగరాయకొండలో కోళ్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ రవికుమార్‌రెడ్డి


మర్రిపూడిలో పెరటికోళ్లు అందజేస్తున్న ఎంపీడీఓ సుదీప

సింగరాయకొండ: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో ప్రభుత్వ పథకాలను ప్రవేశపెడుతున్నారని అందులో ఒకటి వైఎస్సార్ పెరటి కోళ్ల పథకమని వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల కాంప్లెక్స్‌లో బుధవారం వైఎస్సార్ పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని డ్వాక్రా గ్రూపులు 100 యూనిట్లు అందజేసినట్లు తెలిపారు. 5 లక్షల విలువైన కోళ్లు 100 మంది మహిళలకు అందించామన్నారు. ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, ఏపీఎం జయరాజ్, పార్టీ నాయకులు జి శ్రీహరిరెడ్డి, పాకనాటి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ పీవీ రెడ్డి, ముక్కపూడి సత్యన్నారాయణ, ఇండ్ల సుజాత, షేక్ సలీంభాషా, చామల వేణుగోపాలరెడ్డి, షేక్ కరీం, ఆకుల రమేష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మర్రిపూడి: స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ ఎస్ సుదీప తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం డీఆర్‌డీఏ వైఎస్సార్‌కేపీ ఆధ్వర్యంలో 100 మంది డ్వాక్రా మహిళలకు పెరటికోళ్లు పంపిణీ చేశారు. దానా, మెడికల్ కిట్లు అందజేశారు. స్థానిక సర్పంచ్ కదిరి భాస్కర్, గుండ్లసముద్రం సర్పంచ్ గురిజాల మరియబాబు, వెలుగు ఏపీఎం బాబురావు, మాచేపల్లి నాగయ్య, మాచేపల్లి హనుమంతరావు, సీసీ అంజనీకుమారి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు చేవూరు విద్యార్థిని


జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గుడ్లూరు: మండలంలోని చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అఖిల బాల్‌బ్యాడ్మింటన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు బుధవారం తెలిపారు. కర్నూలు జిల్లా మహానందిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు తరఫున ఆడి మంచి ప్రతిభ కనబరిచిన అఖిల.. రాష్ట్ర జట్టుకు ఎంపికై జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు శ్రీనివాసులు తెలిపారు. అలాగే స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి యోగా పోటీల్లో అండర్–17 విభాగంలో అనూషా, రోప్ స్కిప్పింగ్ పోటీలలో అండర్–14 విభాగంలో ఆదిత్య, రాకేష్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ శివమ్మ, యోగా టీచర్ శ్రీనివాసరావును హెచ్‌ఎంతో పాటు, ఉపాధ్యాయులు అభినందించారు.

టీఆర్‌ఆర్‌లో ఆరోగ్యంపై అవగాహన సదస్సు

కందుకూరు రూరల్: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈఎన్‌టీ విభాగం వైద్యుడు చీకటిపల్లి హరీష్‌కుమార్ పాల్గొని చెవి, ముక్కు, గొంతుకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. సైనసైటిస్, గురక, ఇయర్ ఫోన్స్, ఇయర్ బడ్స్ అధికంగా వాడటం వల్ల చెవులకు కలిగే హాని, వర్టిగో తదితర రుగ్మతలకుపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు స్థానిక ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు. మండలంలోని వీఆర్ కోట వద్ద ఉన్న మన్నేరు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం తెలియడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు


స్పందన అర్జీదారు శ్రీలతతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జమీఉల్లా

సింగరాయకొండ: మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్ 1వ లైనులో మురుగుకాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ షేక్ జమీఉల్లా తెలిపారు. ఇటీవల సింగరాయకొండలో నిర్వహించిన కలెక్టర్ స్పందన కార్యక్రమంలో హనుమాన్‌నగర్‌కు చెందిన కుంచాల శ్రీలత తన ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వ ఉంటోందని, డ్రెయినేజీ నిర్మించాలని అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి హనుమాన్‌నగర్ వెళ్లి కుంచాల శ్రీలతతో మాట్లాడారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు రూపొందించి కాలువ నిర్మిస్తామని తెలిపారు.

9 మంది జూదరులు అరెస్టు

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 21,050 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వైవీ రమణయ్య చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com